సాక్షి
అనంతపురం

ఆదివారం । 5 । నవంబర్ । 2023



ఎక్కడా లోటు రాకూడదు

సీఎం పర్యటన ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని మంత్రులు పెద్దిరెడ్డి, జయరాం అధికారులను ఆదేశించారు. 8లో



'కరువు'పై సమగ్ర నివేదికలు

జిల్లాలో నెలకొన్న కరువు పరిస్థితులపై క్షేత్రస్థాయిలో పర్యటించి సమగ్ర నివేదికలు సిద్ధం చేయాలని కలెక్టర్ గౌతమి అధికారులను ఆదేశించారు. 8లో

గరిష్టం/కనిష్టం
34.3°/20.5°

జిల్లా అంతటా శనివారం ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గాయి. వేకువజామున చలి వాతావరణం కనిపించింది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఒకట్రెండు ప్రాంతాల్లో తేలికపాటి జల్లులు పడ్డాయి.



ధర్మవరంలో నిర్వహించిన సామాజిక సాధికార బస్సుయాత్ర సభలో పాల్గొన్న అశేష జనవాహిని

ధర్మవరంలో జనగర్జన



సభలో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి గుమ్మనూరు జయరాం, చిత్రంలో ఎంపీ గోరంట్ల మాధవ్, ఎమ్మెల్యేలు కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, శంకరనారాయణ, తిప్పేస్వామి, అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్సీ మంగమ్మ, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, మాజీ ఎంపీ బుట్టా రేణుక, కార్పొరేషన్ చైర్మన్లు హరీష్‌కుమార్ యాదవ్, మీసాల రంగన్న, హిందూపురం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపిక తదితరులు

- వెల్లివిరిసిన సామాజిక చైతన్యం
- ఉర్రూతలూగించిన నేతల ప్రసంగం
- సామాజిక సాధికార బస్సు యాత్ర విజయవంతం
- వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో సమరోత్సాహం

ధర్మవరం: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలంతా ఏకమయ్యారు. తమకు పదవులిచ్చి అధికారం కట్టబెట్టిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞత తెలుపుతూ జగన్నినాదాలతో ధర్మవరంలో గర్జించారు. ఎన్నికలు ఎప్పుడొచ్చినా.. వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా కదం తొక్కారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలో నిర్వహించిన 'సామాజిక సాధికార బస్సు యాత్ర'కు భారీగా తరలివచ్చి విజయవంతం చేశారు. సభలో నేతల ప్రసంగాలు ఉర్రూతలూగించగా, సామాజిక చైతన్యం వెల్లివిరిసింది. స్థానిక తహసీల్దార్ కార్యాలయ సమీపంలో ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో శనివారం చేపట్టిన సామాజిక సాధికార సభలో ఉపముఖ్యమంత్రి అంజద్‌బాషా, జిల్లా ఇన్‌చార్జి మంత్రి గుమ్మనూరు జయరాం, వైఎస్సార్‌సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మాజీ మంత్రులు అనిల్‌కుమార్ యాదవ్, మాలగుండ్ల శంకరనారాయణ, ఎమ్మెల్సీ మంగమ్మ, ఎంపీ గోరంట్ల మాధవ్, మాజీ ఎంపీ బుట్టా రేణుక, ఎమ్మెల్యేలు డాక్టర్ తిప్పేస్వామి, తోపుదుర్తి ప్రకాశ్ రెడ్డి, సిద్దారెడ్డి, శ్రీధర్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, యాదవ కార్పొరేషన్ చైర్మన్ హరీశ్‌కుమార్ యాదవ్, రజక కార్పొరేషన్ చైర్మన్ రంగన్న,



సభకు వస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎమ్మెల్యేలు ప్రకాష్‌రెడ్డి, సిద్దారెడ్డి తదితరులు

జెడ్పీ వైస్‌చైర్మన్ కామిరెడ్డిపల్లి సుధాకర్‌రెడ్డి, హిందూపురం సమన్వయకర్త దీపిక, ధర్మవరం మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మి, చేనేత నాయకుడు గిర్రాజు నగేశ్, ముదిగుబ్బ ఎంపీపీ ఆదియాదవ్, పట్టణ అధ్యక్షుడు ప్రకాశ్ పాల్గొన్నారు.

దిగ్విజయంగా సాగిన యాత్ర..

సామాజిక సాధికార బస్సు యాత్ర ధర్మవరం నియోజకవర్గంలో దిగ్విజయంగా సాగింది. సీఎం వైఎస్ జగన్ పాలనలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు జరిగిన ప్రయోజనాలతో పాటు, చేనేతలకు ప్రత్యేకంగా కలిగిన లబ్ధిపై యాత్రలో నేతలు ప్రస్తావించారు. వేలాదిగా తరలివచ్చిన ప్రజలు సభ అసాంతం వక్తల ప్రసంగాలు శ్రద్ధగా వినడమే కాకుండా.. జై జగన్ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషా, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి గుమ్మనూరు జయరామ్, మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ.. జగనన్న వచ్చాకే సామాజిక సాధికారత సాధ్యమైందన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు నిజమైన స్వాతంత్ర్యం వచ్చిందన్నారు. మాజీ ఎంపీ బుట్టా రేణుక మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాలకు మేలు చేయాలనే తపన ఉన్న నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. పాదయాత్రలో ఇచ్చిన హామీలను తూ.చ. తప్పకుండా అమలు చేశారన్నారు. అక్కడితో ఆగకుండా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలను ప్రభుత్వంలో భాగస్వామ్యం చేశారన్నారు. మడకశిర ఎమ్మెల్యే డాక్టర్ ఎం.తిప్పేస్వామి మాట్లాడుతూ మళ్లీ జగన్ సీఎం అయితేనే బడుగు, బలహీన వర్గాలకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుంది. పేదరికం పోవాలంటే 2024లో మళ్లీ జగన్ సీఎంగా అధికారం చేపట్టాలన్నారు. సామాన్యుడికి సైతం అత్యున్నత పదవిని కట్టబెట్టిన ఘనత జగన్‌దేనన్నారు. దళితులకు హోం మంత్రి ఇచ్చిన ఏకైక సీఎం కూడా ఆయనేనని కొనియాడారు.



జై జగన్ : నినదిస్తున్న మహిళలు

సామాజిక న్యాయానికి సరైన అర్థం



బీసీ, ఎస్టీ, ఎస్సీ, మైనార్టీల గురించి గతంలో నాయకుల ఆలోచన విధానం ఎలా ఉంది? మన రాష్ట్రంలో ఇప్పుడు జగనన్న పాలనలో ఎలా ఉందని మనమంతా ఆలోచించాలి. జనాభాలో అత్యధిక శాతం ఉన్న వారిని ఓటర్లుగా కాకుండా, నాయకులుగా చూశారు. వారికీ అధికారం ఇవ్వాలన్న సంకల్పంతోనే బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు పదవులిచ్చారు. సామాజిక న్యాయానికి సరైన అర్థం చెప్పారు. ఇటీవల మంత్రివర్గ సమావేశంలో కులగణనకు ఆమోదం తెలపడం సాహసోపేత నిర్ణయం.

– ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

బీసీలు గర్వపడాలి



జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో నడుస్తున్నందుకు మనమంతా గర్వపడాలి. జగనన్న ప్రభుత్వంలో బడుగు, బలహీన వర్గాలకు అందుతున్న సంక్షేమం దేశంలోనే ఎక్కడా అందడం లేదు. బడుగు, బలహీన వర్గాలంటే ఎంతో ప్రేమ చూపే మన సీఎం.. ఎన్నడూ వారిని ఓటుబ్యాంకుగా చూడలేదు. సమాజానికి వెన్నెముకలాంటివారు నా బీసీలు అని సగర్వంగా చాటిన ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలను ప్రభుత్వంలో భాగస్వాములను చేసిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కింది.

– శంకరనారాయణ, ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షుడు

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా..



రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా జగనన్న పాలన సాగుతోంది. జగనన్న అమ్మ ఒడి, విద్యా, వసతి దీవెన, నాడు – నేడు పథకాలు పేదల జీవితాలను మార్చాయి. జగనన్న చేపట్టిన సంస్కరణలతో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ పిల్లలే అత్యధికంగా లబ్ధి పొందారు.

– గోరంట్ల మాధవ్, ఎంపీ, హిందూపురం

మహిళలకు పెద్దపీట



సీఎం జగనన్న మహిళలకు పెద్ద పీట వేశారు. కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, జెడ్పీ, స్థానిక సంస్థల్లో పదవులు కట్టబెట్టారు. గతంలో ఎన్నడూ ఏ రాజకీయ పార్టీ కూడా మహిళలకు ఇన్ని పదవులు ఇవ్వలేదు. మహిళా సాధికారత జగనన్నతోనే సాధ్యం. సచివాలయ వ్యవస్థ ద్వారా పారదర్శక పాలన అందిస్తున్నారు.

– బోయ గిరిజమ్మ, జెడ్పీ చైర్ పర్సన్

బాల్య వివాహాల అడ్డుకట్టకు పకడ్బందీ చర్యలు



కలెక్టర్ గౌతమి

అనంతపురం అర్బన్: జిల్లాలో బాల్య వివాహాల అడ్డుకట్టకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఎస్.జవహర్‌రెడ్డికి కలెక్టర్ ఎమ్.గౌతమి తెలిపారు. స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలు, ఆరోగ్యం, స్త్రీ శిశు సంక్షేమం, తదితర అంశాలపై ప్రధాన కార్యదర్శి శనివారం విజయవాడలోని తన క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టర్లతో సమీక్షించారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్‌తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. జిల్లాలో బాల్యవివాహాలను అరికట్టేందుకు తీసుకుంటున్న చర్యల గురించి ఈ సందర్భంగా సీఎస్‌కు కలెక్టర్ వివరించారు. బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాల గురించి పాఠశాలల్లో విద్యార్థులకు రోజూ తెలియజేసే కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. దేవాలయాలు, మసీదులు, చర్చీల్లో బాల్యవివాహాలు జరగకుండా చూడాలని పూజారులు, ఖాజీలు, పాస్టర్లకు ప్రత్యేకంగా ఆదేశాలిచ్చామన్నారు. బాల్య వివాహాల నిర్మూలనపై గ్రామస్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు అవగాహన కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. బాల్యవివాహం జరిగిందని తెలిసిన వెంటనే చర్యలు తీసుకుంటున్నామన్నారు. బాల్యవివాహాల కట్టడిపై ప్రతి నెలా ఎస్పీ, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్, ఐసీడీఎస్, ఇతర అనుబంధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహిస్తున్నామన్నారు.

జీఈఆర్ నమోదుకు చర్యలు

జిల్లాలో వంద శాతం స్థూల నమోదు నిష్పత్తి (గ్రాస్ ఎన్‌రోల్మెంట్ రేషియో– జీఈఆర్) నమోదుకు చర్యలు చేపడుతున్నామని కలెక్టర్ చెప్పారు. బాలికల డ్రాపౌట్స్ తగ్గించి వారిని మళ్లీ పాఠశాలల్లో చేర్పించడంపై దృష్టి పెట్టామన్నారు. 5 నుంచి 18 ఏళ్ల వయసున్న పిల్లలను పాఠశాలలో చేర్పించడం ప్రధాన అంశంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. సమావేశంలో సీపీఓ అశోక్‌కుమార్‌రెడ్డి, డీఎంహెచ్‌ఓ భ్రమరాంబదేవి, ఆస్పత్రి సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, ఎస్ఎస్ఏ ఏపీసీ వరప్రసాద్, ఆరోగ్యశ్రీ కో–ఆర్డినేటర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, డీఈఓ నాగరాజు, డీఎల్‌డీఓ ఓబులమ్మ, 'స్పందన' ఇన్‌చార్జ్ వాణిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

క్రీడల్లోనూ రాణించాలి



సైక్లింగ్ పోటీలను ప్రారంభిస్తున్న భీమిరెడ్డి

వజ్రకరూరు: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఎమ్మెల్సీ వై.శివరామి రెడ్డి తనయుడు, ఖోఖో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వై.భీమిరెడ్డి పిలుపునిచ్చారు. శనివారం వజ్రకరూరు మండలం కొనకొండ్లలో రాష్ట్ర స్కూల్ గేమ్స్ ఫెడరేషన్‌లో భాగంగా నిర్వహించిన ఉమ్మడి అనంతపురం జిల్లా సైక్లింగ్ (అండర్ -14,17) క్రీడాకారుల ఎంపిక పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడల్లో రాణిస్తే భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందన్నారు. తల్లిదండ్రులు పిల్లలను చదువులతో పాటు క్రీడలపై కూడా ఆసక్తి చూపేలా ప్రోత్సహించాలని సూచించారు. కొనకొండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివిన అనేక మంది విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో సత్తా చాటడం గర్వకారణమన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం వేణుగోపాల్, పీడీలు సత్యనారాయణ, కళా సుధాకర్, హయుబ్‌ఖాన్, ప్రసాద్, సంపత్, రాజేష్, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన వారు..

అండర్- 17 బాలికల విభాగం: రాజేశ్వరి (జెడ్పీహెచ్ఎస్,తిమ్మంపల్లి), వైష్ణవి (జెడ్పీ హెచ్ఎస్, గడేకల్), పవిత్ర (జెడ్పీ హెచ్ఎస్, తిమ్మంపల్లి), చైతన్య (జెడ్పీహెచ్ఎస్, కొనకొండ్ల)

అండర్- 17 బాలుర విభాగం : చంద్రశేఖర్ (జెడ్పీహెచ్ఎస్, గడేకల్), దిలీప్ (జెడ్పీహెచ్ఎస్, నరసాపురం), వినయ్ (జెడ్పీహెచ్ఎస్, గడేకల్),యశ్వంత్‌రెడ్డి (తిమ్మంపల్లి)

అండర్- 14 బాలుర విభాగం.. : మహమ్మద్ ఆసీఫ్ (ఎస్‌కేజీహెచ్ఎస్, ఉరవకొండ), గాదిలింగ (జెడ్పీహెచ్ఎస్, గడేకల్), లక్ష్మీదీపక్ (జెడ్పీహెచ్ఎస్, తిమ్మంపల్లి), భీమేష్(జెడ్పీ హెచ్ఎస్, గడేకల్)

అండర్- 14 బాలికలు: లావణ్య, చంద్రిక (జెడ్పీహెచ్ఎస్, తిమ్మంపల్లి), అపూర్వ, సంజన (జెడ్పీహెచ్ఎస్, కొనకొండ్ల).

ఎక్కడా లోటు రాకూడదు

- సీఎం పర్యటన ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలి
- మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, గుమ్మనూరు జయరాం
- అధికారులతో సమీక్ష

పుట్టపర్తి అర్బన్/రూరల్: 'సీఎం వైఎస్ జగన్ ఈ నెల 7న పుట్టపర్తి వస్తున్నారు. ఏర్పాట్లు ఘనంగా ఉండాలి. ఎక్కడా ఎలాంటి లోటు రాకూడదు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా జాగ్రత్తగా విధులు నిర్వర్తించాలి' అని వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి గుమ్మనూరు జయరాం అధికారులను ఆదేశించారు. సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలనకు శనివారం పుట్టపర్తి విచ్చేసిన మంత్రులు కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో ఎమ్మెల్యేలు, జిల్లా అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ అరుణ్ బాబు, ఎస్పీ మాధవరెడ్డి, ఎంపీ గోరంట్ల మాధవ్, పుట్టపర్తి, పెనుకొండ, కదిరి ఎమ్మెల్యేలు దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, మాలగుండ్ల శంకర నారాయణ, డాక్టర్ సిద్దారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ఎమ్మెల్సీ మంగమ్మ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రులు పెద్దిరెడ్డి, గుమ్మనూరు మాట్లాడుతూ.. 'వైఎస్సార్ రైతు భరోసా-పీఎం కిసాన్' సొమ్ము పుట్టపర్తి సభ నుంచే రాష్ట్రంలోని రైతులకు సీఎం జగన్ విడుదల చేస్తారన్నారు. 6వ తేదీ సాయంత్రంలోపు ఏర్పాట్లన్నీ పూర్తి చేయాలన్నారు. దేశంలో ఏ ముఖ్యమంత్రీ చేయని విధంగా రైతులకు సీఎం జగన్ మేలు చేశారన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు 99.05 శాతం నెరవేర్చారన్నారు. రైతులు ఆయనకు మద్దతు ఇవ్వాలని కోరారు. రైతాంగం, వైఎస్సార్ సీపీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం సీఎం విమానం ల్యాండ్ కానున్న సత్యసాయి విమానాశ్రయం, బహిరంగ సభ వేదిక, వాహనాల పార్కింగ్, రహదారులను పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా అగ్రి అడ్వయిజరీ బోర్డు చైర్మన్ అవుటాల రమణారెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు, ఎంపీపీ ఏవీ రమణారెడ్డి తదితరులు ఉన్నారు.

సీఎం పర్యటన షెడ్యూల్ ఇలా..

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 7వ తేదీ (మంగళవారం) పుట్టపర్తికి విచ్చేయనున్నట్లు కలెక్టర్ అరుణ్‌బాబు తెలిపారు. 7వ తేదీ ఉదయం 10.15 గంటలకు పుట్టపర్తి సత్యసాయి విమానాశ్రయం చేరుకుని ప్రజాప్రతినిధులతో మాట్లాడతారు. 10.45 గంటలకు సభా వేదిక వద్దకు చేరుకుంటారు. 10.50 గంటలకు జ్యోతి ప్రజ్వలన చేస్తారు. ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధుల ప్రసంగం తర్వాత 11.20 గంటలకు రైతులతో సమావేశమవుతారు. మధ్యాహ్నం 12.05 గంటలకు సభను ఉద్దేశించి ప్రసంగిస్తారు. 12.15 గంటలకు రైతు భరోసా చెక్కును రైతులకు అందజేస్తారు. 12.25 గంటలకు సత్యసాయి విమానాశ్రయం చేరుకుంటారు. అక్కడ స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులతో 12.55 వరకూ సమావేశం అవుతారు. ఒంటి గంటకు తిరిగి గన్నవరం వెళ్లిపోతారని కలెక్టర్ వెల్లడించారు.



బహిరంగ సభావేదికను పరిశీలిస్తున్న మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, గుమ్మనూరు జయరాం, ఎంపీ మాధవ్, ఎమ్మెల్యేలు శ్రీధర్‌రెడ్డి, శంకరనారాయణ, సిద్దారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ మాధవరెడ్డి తదితరులు

ఏర్పాట్లు పరిశీలించిన డీఐజీ

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పుట్టపర్తి పర్యటన నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లను డీఐజీ అమ్మిరెడ్డి, ఎస్పీ మాధవరెడ్డి శనివారం సాయంత్రం పరిశీలించారు. సత్యసాయి విమానాశ్రయం సమీపంలోని సభాస్థలిని పరిశీలించి, పోలీసులకు తగిన సూచనలు చేశారు. సీఎం కాన్వాయ్, ఎస్కార్ట్, పార్కింగ్ భద్రత ఏర్పాట్లపై నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా పకడ్బందీగా వ్యవహరించాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో డీఎస్పీ వాసుదేవన్, ఎస్బీ సీఐ రవీంద్రారెడ్డి, సీఐ కొండారెడ్డి, రామయ్య, ఆర్ఐలు టైటాస్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

'కరువు'పై సమగ్ర నివేదికలు

అనంతపురం అర్బన్: జిల్లాలో నెలకొన్న కరువు పరిస్థితులపై సమగ్ర నివేదికలు సిద్ధం చేయాలని కలెక్టర్ ఎం.గౌతమి సంబంధిత అధికారులను ఆదేశించారు. నష్ట నివారణ చర్యలు, పరిహారం, చేపట్టబోయే కార్యక్రమాలపై ప్రతిపాదనలు తయారు చేయాలన్నారు. శనివారం కలెక్టరేట్ బలోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికారులందరూ రాబోయే రెండు, మూడు నెలలు అప్రమత్తంగా ఉండాలన్నారు. క్షేత్రస్థాయిలో పర్యటించి వాస్తవ నివేదికలు రూపొందించాలన్నారు. వ్యవసాయ, ఉద్యాన, పశు సంవర్ధక, ఆర్‌డబ్ల్యూఎస్, ప్రజారోగ్య శాఖల పరిధిలో నివేదికలను యుద్ధ ప్రాతిపదికన సిద్ధం చేసి సమర్పించాలన్నారు. తాగునీటికి సంబంధించి క్షేత్రస్థాయిలో నెలకొన్న పరిస్థితి, తీసుకోవాల్సిన చర్యలపై నివేదిక ఇవ్వాలని కోరారు. పుట్లూరు, యల్లనూరు, రాయదుర్గం, గుత్తి, గుంతకల్లు, ఉరవకొండ తదితర ప్రాంతాల్లో తాగునీటి సమస్యపై ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. ఎక్కడా నీటి ఎద్దడి తలెత్తకుండా నివారణ చర్యలు సత్వరం తీసుకోవాలని ఆదేశించారు.సమావేశంలో డీఆర్‌ఓ గాయత్రిదేవి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఆనంద్, సీపీఓ అశోక్ కుమార్‌రెడ్డి, ఎల్‌డీఎం సత్యరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఇహతాషాన్‌బాషా, జేడీఏ ఉమామహేశ్వరమ్మ, పశు సంవర్ధక శాఖ జేడీ సుబ్రమణ్యం, ఉద్యాన శాఖ డీడీ రఘునాథ్‌రెడ్డి, హెచ్ఎల్‌సీ ఎస్ఈ రాజశేఖర్, ప్రజారోగ్య శాఖ ఈఈ సతీష్ చంద్ర, తదితర అధికారులు పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్ల మాయలో పడొద్దు

అనంతపురం ఎడ్యుకేషన్: స్మార్ట్ ఫోన్లు వినియోగిస్తున్న యువత సైబర్ నేరగాళ్ల మాయలో పడకుండా అప్రమత్తంగా ఉండాలని డీఐజీ అమ్మిరెడ్డి సూచించారు. 'ఆన్‌లైన్ లైంగిక దోపిడీ నివారణ -సైబర్ నేరాలపై పోరాటం' అనే అంశంపై ఎన్ఎస్ఎస్, సీఐఎఫ్, హ్యాండ్స్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం ఆర్ట్స్ కళాశాల డ్రామా హాలులో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన డీఐజీ అమ్మిరెడ్డి మాట్లాడుతూ సెల్‌ఫోన్ వినియోగం నేడు నిత్యావసరంగా మారిందన్నారు. ఇది అనేక సమస్యలకు దారి తీస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. స్మార్ట్‌ఫోన్లతో ఎక్కువగా యువతే నష్టపోతోందన్నారు. మొత్తం నేరాల్లో 10 శాతం సైబర్ కేసులు ఉంటున్నాయన్నారు. ఫొటో మార్ఫింగ్, అశ్లీల చిత్రాలు పంపడం వంటివాటి ద్వారా సైబర్ నేరగాళ్లు యువతను వేధింపులకు గురి చేస్తున్నారన్నారు. ఎలాంటి సమస్యలు ఎదురైనా టోల్‌ఫ్రీ నంబరు 1930కు ఫోన్ చేయాలని సూచించారు. మారుతున్న సాంకేతిక సమాజంలో అన్ని కార్యకలాపాలు ఇంటర్‌నెట్ ద్వారా సాగుతున్నాయని, వినియోగంలో అప్రమత్తత అవసరమని కళాశాల ప్రిన్సిపల్ ఏసీఆర్ దివాకర్‌రెడ్డి తెలిపారు. ఇంటర్నెట్ కేవలం 5 శాతం మాత్రమే సురక్షితం అని చిల్డ్రన్ ఆఫ్ ఇండియా నిర్వాహకులు సుబ్రత్‌కుమార్ పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఐఎఫ్ అధికారులు వై.జయంతి, కొండన్న, ఎన్ఎస్ఎస్ అధికారులు విష్ణుప్రియ, సోమశేఖర్, సుధాకర్, జయలక్ష్మి, బాలాజీనాయక్, శ్రీనివాసులు, రామకృష్ణ, కామర్స్ విభాగాధిపతి శ్రీరాములునాయక్ పాల్గొన్నారు. అనంతరం అవగాహన కరపత్రాలను డీఐజీ విడుదల చేశారు.



కరపత్రాలు విడుదల చేస్తున్న డీఐజీ అమ్మిరెడ్డి తదితరులు

కటకటాల్లోకి నయవంచకులు

అనంతపురం క్రైం: ప్రేమ పేరుతో ఓ యువతి జీవితాన్ని నరకప్రాయం చేశాడో వంచకుడు. అదే యువతిని బ్లాక్ మెయిల్ చేసి అత్యాచారానికి తెగబడ్డాడు మరో దుర్మార్గుడు. ఎస్పీ ఆదేశాలతో కేసును సీరియస్‌గా తీసుకున్న పోలీసులు నిందితులను కటకటాల వెనక్కి పంపారు. స్థానిక దిశ పోలీసు స్టేషన్‌లో శనివారం డీఎస్పీ ఆంథోనప్ప వెల్లడించిన వివరాల మేరకు.. పెద్దవడుగూరు మండలం కొండూరు గ్రామానికి చెందిన మొలకతాళ్ల కృష్ణారెడ్డి బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేసేవాడు. తాడిపత్రి నియోజకవర్గానికి చెందిన ఓ యువతిని ప్రేమ పేరుతో వేధించేవాడు. తను పట్టించుకోకపోవడంతో బ్లాక్ మెయిల్‌కు దిగాడు. బెంగళూరుకు పిలిపించుకొని స్నేహితుల గదికి తీసుకెళ్లి శారీరకంగా అనుభవించాడు. ఈ విషయం కృష్ణారెడ్డి క్లాస్‌మేట్, గుంతకల్లు పట్టణంలోని బెంచ్‌కొట్టాలకు చెందిన దివాకర్ బాబుకు తెలిసింది. సదరు యువతి కృష్ణారెడ్డితో కలిసి ఉన్న ఫొటోలు, వీడియోలు సేకరించి, ఆమెను వేధించడం ప్రారంభించాడు. బలవంతంగా ఆమెను గుంతకల్లుకు పిలిపించుకుని, స్థానికంగా ఉండే ఓ లాడ్జికు తీసుకెళ్లి అత్యాచారం చేశాడు. ఈ క్రమంలోనే మళ్లీ తెరపైకి వచ్చిన కృష్ణారెడ్డి.. దివాకర్‌తో సదరు యువతి కలిసి ఉన్న ఫొటోలను సంపాదించి, వాటిని సోషల్ మీడియా గ్రూపుల్లో పెట్టి బెదిరింపులకు దిగాడు. నరక యాతన అనుభవించిన బాధితురాలు ఎట్టకేలకు తనకు జరిగిన అన్యాయాన్ని కుటుంబ సభ్యులతో పంచుకుంది. 'దిశ' యాప్ ద్వారా బాధను గ్రామ మహిళా పోలీసుకు విన్నవించింది. ఈ విషయం ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్‌కు తెలియడంతో సీరియస్‌గా పరిగణించారు. తక్షణమే కేసు నమోదు చేసి నిందితులను అరెస్ట్ చేయాలని 'దిశ' పోలీసు స్టేషన్ డీఎస్పీ ఆంథోనప్పకు ఆదేశాలు చేశారు. ఈ విషయం తెలిసిన కృష్ణారెడ్డి, దివాకర్ బాబులు పరారయ్యేందుకు ప్లాన్ వేసుకున్నారు. శనివారం స్థానిక నగర శివారులోని నేషనల్ పార్కు వద్ద దాక్కుని ఉండగా, పక్కాగా అందించిన సమాచారం మేరకు పోలీసులు వారిని అరెస్ట్ చేశారు. కటకటాల వెనక్కి పంపారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ ఆంథోనప్ప

యువకుడి ఆత్మహత్య

- డిగ్రీ పాస్ కాలేదని అఘాయిత్యం

యాడికి: డిగ్రీ పాస్ కాలేక పోయాననే బెంగతో ఓ యువకుడు ఇంట్లోనే ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మండలంలోని చందన గ్రామంలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఎస్ఐ గురు ప్రసాద్ రెడ్డి తెలిపిన మేరకు..



మారుతి (ఫైల్)

చందన గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ రామప్ప, రమాదేవి దంపతులకు ఇద్దరు కుమారులు. చిన్న కుమారుడు మారుతి (23) యాడికి మండలకేంద్రంలోని ఓ ప్రైవేటు కళాశాలలో డిగ్రీలో చేరాడు. గతేడాది ఓ సబ్జెక్ట్‌లో ఫెయిల్ అయ్యాడు. అదే ఏడాది సెప్టెంబర్, ఈ ఏడాది మార్చిలో మళ్లీ పరీక్ష రాసినా ఉత్తీర్ణత కాలేదు. తోటి స్నేహితులు ఉన్నత చదువులకు వెళ్లడం చూసి కుంగిపోయేవాడు. ఖాళీగా ఇంటి వద్ద ఉండలేక సోదరుడు హరేంద్రతో కలిసి వైరింగ్ పనులకు వెళ్లేవాడు. శుక్రవారం పనికి వెళ్లిన సోదరులు రాత్రికి ఇంటికి వచ్చి పడుకున్నారు. శనివారం ఉదయం తన గది నుంచి ఎంతసేపటికీ మారుతి బయటకు రాలేదు. మిద్దె ఎక్కి గవాక్షంలో నుంచి చూస్తే ఫ్యాన్‌కు ఉరికి వేలాడుతూ కనిపించాడు. హరేంద్ర తమ బంధువుల సాయంతో రూం తలుపు పగులగొట్టి మారుతిని కిందికి దించాడు. కుమారుడి మృతదేహం వద్ద తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు. ఎస్ఐ గురు ప్రసాద్ రెడ్డి ఘటనాస్థలాన్ని పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మనస్తాపంతో యువకుడు..

పామిడి: పట్టణంలోని వడ్డే వీధికి చెందిన వడ్డే శంకరయ్య కుమారుడు అరవింద్ (22) శుక్రవారం అర్ధరాత్రి సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పామిడి పోలీసుల వివరాల మేరకు.. శంకరయ్యకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు సంతానం. మూడోవాడైన అరవింద్ బేల్దారి పనిచేస్తూ కుటుంబానికి చేదోడు వాదోడుగా ఉండేవాడు. ఇటీవల చెల్లి పెళ్లి చేశాడు. నూతన గృహాన్ని నిర్మించుకున్నారు. పెళ్లి, ఇంటి నిర్మాణానికి చేసిన అప్పులు తడిసి మోపెడయ్యాయి. ఈ క్రమంలోనే ఇంట్లో కుటుంబకలహాలు చోటు చేసుకున్నాయి. దీంతో మనస్తాపానికి గురైన అరవింద్ శుక్రవారం అర్ధరాత్రి సమయంలో ఇంటి ముందు పైకప్పు కొక్కేనికి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భవన నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

అనంతపురం టౌన్: ప్రభుత్వ భవన నిర్మాణ పనులను వేగవంతం చేయాలని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రభుత్వ సలహాదారు పోతిరెడ్డి నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. శనివారం స్థానిక జిల్లా నీటియాజమాన్య సంస్థ కార్యాలయంలో పంచాయతీ రాజ్, డీఆర్‌డీఏ, డ్వామా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాల నిర్మాణ పనులు వేగవంతం చేయాలన్నారు. బిల్లులు కాంట్రాక్టర్ల ఖాతాల్లోకి త్వరితగతిన జమ చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటించిన నేపథ్యంలో అదనపు పనిదినాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. స్థానికంగానే ఉపాధి కూలీలకు పని కల్పించాలన్నారు. జిల్లాలో హార్టికల్చర్‌ను మరింత అభివృద్ధి చేయాలని సూచించారు. కార్యక్రమంలో డ్వామా పీడీ వేణుగోపాల్‌రెడ్డి, పంచాయతీరాజ్ శాఖ ఎస్ఈ భాగ్యరాజ్, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ నరసింహారెడ్డి, ఏపీడీలతో పాటు పంచాయతీరాజ్ డీఈలు తదితరులు పాల్గొన్నారు.



సమీక్షలో మాట్లాడుతున్న నాగార్జునరెడ్డి

టీచింగ్ పోస్టుల భర్తీకి ఆమోదం

అనంతపురం ఎడ్యుకేషన్: ఉమ్మడి జిల్లాలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలల్లో వివిధ సబ్జెక్టుల బోధనకు గెస్ట్ ఫ్యాకల్టీల నియామకానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఆ విభాగం జిల్లా కో-ఆర్డినేటర్ ఎ.మురళీకృష్ణ ఓ ప్రకటన విడుదల చేశారు. శ్రీసత్యసాయి జిల్లా మలుగూరు పాఠశాలలో టీజీటీ ఫిజిక్స్, హిందూపురం బాలికల పాఠశాలలో టీజీటీ గణితం, పీజీటీ ఫిజిక్స్, రొళ్ల పాఠశాలలో టీజీటీ ఫిజిక్స్, పీజీటీ ఫిజిక్స్ టీచర్, అనంతపురం జిల్లా ఉరవకొండ స్కూల్‌లో పీడీ, తిమ్మాపురం పాఠశాలలో టీజీటీ ఫిజిక్స్, పీఈటీ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అభ్యర్థులు ఆయా స్కూళ్లలోకానీ, జిల్లా కోఆర్డినేటర్ కార్యాలయంలో గాని దరఖాస్తులు అందజేయవచ్చు. బీఈడీతో పాటు సంబంధిత సబ్జెక్టుల్లో పీజీ చేసిన వారు అర్హులు. బాలికల కళాశాలలకు మహిళా అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. టెట్ అర్హతతో పాటు ఇంగ్లిష్ మీడియం బోధనలో ప్రావీణ్యం ఉన్న వారికి ప్రాధాన్యత ఉంటుంది.

ప్రేమ పేరుతో వంచన

అనంతపురం క్రైం: తెలిసీ తెలియని వయసులో ప్రేమ పేరుతో తప్పటడుగులు వేసిన ఓ బాలిక గర్భం దాల్చింది. 'సఖి' సెంటర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఆలస్యంగా వెలుగు చూసిన ఈ ఘటన వివరాలు.. తాడిపత్రి పట్టణ సమీపంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక ఇంటర్ చదువుతోంది. రోజూ పట్టణంలోని కళాశాలకు రాకపోకలు సాగించేది. ఓ యువకుడు ప్రేమ పేరుతో ఆమెకు దగ్గరయ్యాడు. పెళ్లి కూడా చేసుకుంటానని చెప్పడంతో నమ్మింది. ఇద్దరూ పలు దఫాలు సన్నిహితంగా మెలిగారు. నాలుగు రోజుల క్రితం కడుపులో ఏదో మెదులుతున్నట్లుందని బాలిక చెప్పడంతో కుటుంబ సభ్యులు అనంతపురం ప్రభుత్వాస్పత్రికి వచ్చారు. పరీక్షించిన వైద్యులు అమ్మాయి గర్భం దాల్చిందని నిర్ధారించారు. ఆ మాటతో అమ్మాయి కుటుంబం కుదేలైపోయింది. విషయం బయటకు తెలిస్తే పరువు పోతుందని భావించి.. గర్భం తొలగించాలని వైద్యులను ప్రాధేయపడింది. ఇందుకు వైద్యులు ఒప్పుకోలేదు. విషయాన్ని 'సఖి' సెంటర్‌కు తెలపడంతో.. సిబ్బంది వచ్చి బాలికను తీసుకెళ్లారు. ఫోన్ ద్వారా సమాచారమందిస్తే పోలీసులు స్పందించలేదు. రెండు రోజులుగా బాలిక 'సఖి' సెంటర్ నిర్వాహకుల సంరక్షణలోనే చికిత్స పొందుతోంది. మరోమారు సీఐకి ఫోన్ చేస్తే.. 'బాలికకు కడుపు చేసింది బంధువుల అబ్బాయే కనుక అతనికే ఇచ్చి పెళ్లి చేస్తే సరిపోతుంది' అంటూ ఉచిత సలహా ఇచ్చారు. బాల్య వివాహం సరైనది కాదని భావించిన 'సఖి' సిబ్బంది 'దిశ' డీఎస్పీ ఆంథోనప్ప దృష్టికి తీసుకెళ్లారు. ఆయన బాధితురాలి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పడంతో పాటు కేసు నమోదు చేశారు.

రేపు జాబ్ మేళా



అనంతపురం అగ్రికల్చర్: 'స్పందన స్ఫూర్తి' ఫైనాన్షియల్ లిమిటెడ్ కంపెనీలో బ్రాంచి మేనేజర్, క్రెడిట్ అసిస్టెంట్లుగా నియామకానికి ఈనెల 6న స్థానిక ఎంప్లాయిమెంట్ ఆఫీస్‌లో జాబ్‌మేళా ఏర్పాటు చేసినట్లు ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ ఏ.కళ్యాణి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ విద్యార్హత, బ్యాంకింగ్ రంగంలో అనుభవం కలిగిన వారు అర్హులన్నారు. 20 నుంచి 27 సంవత్సరాల్లోపు ఉండాలన్నారు. హైదరాబాద్‌లో పని చేయాల్సి ఉంటుందని, రూ.20 వేల వేతనం అందిస్తారన్నారు. అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లా పరిధిలో క్రెడిట్ అసిస్టెంట్‌గా పనిచేయడానికి ఐటీఐ, ఇంటర్, డిగ్రీ విద్యార్హత, 20 నుంచి 27 సంవత్సరాలలోపున్న వారు అర్హులన్నారు. నెలసరి వేతనం రూ.14 వేలు ఉంటుందన్నారు. నిరుద్యోగ యువకులు మాత్రమే అర్హులని తెలిపారు. బయోడేటా, విద్యార్హత సర్టిఫికెట్లతో ఈనెల 6న ఉదయం 10.30 గంటలకు హాజరు కావాలని సూచించారు.

దొంగ వెనుక దీన గాథ!




అనంతపురం క్రైం: జల్సాలు, వ్యసనాల కోసమో దొంగతనాలు చేయడం చూశాం. అయితే, ఓ యువకుడు తన తల్లిదండ్రుల ఆచూకీ తెలుసుకునేందుకు దొంగగా మారాడు. కిలో బంగారం చోరీ కేసులో పోలీసులు అదుపులోకి తీసుకున్న దొంగ వెనక విషాద గాథ ఉన్నట్లు తెలిసింది. ఆ దీనగాథ పోలీసుల మనసులను కూడా కదిలించినట్లు సమాచారం. అతడి కష్టాలను విన్న పోలీసులు పాపం విధి వంచితుడంటూ సానుభూతి వ్యక్తం చేస్తున్నారు. అత్యంత విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసిన సమాచారం మేరకు.. గుజరాత్‌లోని సూరత్ ప్రాంతానికి చెందిన వినయ్ తల్లిదండ్రుల ఎడబాటును తట్టుకోలేక ఆరేళ్ల వయసులో ఇంటి నుంచి తప్పించుకుని వచ్చాడు. రైలుగుండా అనంతపురం చేరుకున్నాడు. స్థానిక పోలీసులకు చిక్కాడు. వినయ్‌ని తిరిగి తల్లిదండ్రుల చెంతకు చేర్చాలని పోలీసులు సాగించిన అన్వేషణ ఫలించలేదు. దీంతో నగరంలోని విజయనగర కాలనీలో ఉన్న సీడబ్ల్యూసీ గృహంలో చేర్చారు. ఆదరించాల్సిన పాస్టర్ వినయ్‌ని నిత్యం చితకబాదుతూ హింసించడం ప్రారంభించాడు. దీంతో మళ్లీ అక్కడి నుంచి ఎలాగోలా తప్పించుకుని ప్లాట్‌ఫాంపై పడ్డాడు. కడుపు నింపుకునే మార్గం కనిపించలేదు. సెల్‌ఫోన్లు చోరీ చేసి వాటిని అమ్ముకుని పొట్ట పోసుకోవడం ఆరంభించాడు. వేసుకునేందుకు దుస్తులు కూడా లేక పోవడంతో నగరంలో ఆరుబయట ఇళ్ల ముందు ఆరేసిన వస్త్రాలను అపహరించేవాడు. అదే ప్రవృత్తిగా మారిపోయింది. అలా వినయ్‌కు 18 ఏళ్లు దాటాయి. ఈ క్రమంలోనే తన వాళ్లను కలుసుకునేందుకు సూరత్ చేరుకున్నాడు. తల్లిదండ్రుల జాడ కనిపించలేదు. దీంతో మళ్లీ అనంతపురం చేరుకున్నాడు. స్థానిక ఎన్టీఆర్ మార్గ్‌లోని మయూరీ హోటల్‌లో సప్లయర్‌గా చేరాడు. దొంగతనాలు చేయడం మాత్రం మానలేదు. అలా కొంత కాలం క్రితం స్థానిక రెండో రోడ్డులోని ఓ ఇంట్లో చొరబడ్డాడు. చాలా డబ్బు, బంగారం గుర్తించినా.. కొన్ని దుస్తులు, కొంత బంగారం, డబ్బు దొంగిలించాడు. మళ్లీ కన్నవారి కోసం సూరత్ పయనమయ్యాడు.

మూడో సారికి చిక్కాడు..

అయిన వారిని కలుసుకుందామని వినయ్ చేసిన ప్రయత్నం మళ్లీ ఫలించలేదు. దీంతో తిరిగి నగరానికి చేరుకున్నాడు. రెండో సారి కూడా రెండో రోడ్డులోని అదే ఇంట్లో కొంత నగదు చోరీ చేశాడు. అదే క్రమంలో ఇటీవల మూడో సారిగా మళ్లీ గృహంలో చొరబడ్డాడు. కొంత డబ్బు, బంగారం, పంచలోహ విగ్రహం తీసుకుని మయూరీ హోటల్‌కు వెళ్లాడు. తనతో పాటు హోటల్‌లో పని చేసే మహిళకు బంగారు నెక్లెస్, పనివాళ్లలో తెలిసిన మిత్రుడికి బంగారు గొలుసు, హోటల్ యజమానికి పంచలోహ విగ్రహం ఇచ్చాడు. అయితే, మహిళ తనకిచ్చిన నెక్లెస్ గిల్టుదని భావించి అందరి ముందే మురుగు గుంతలో పడేసింది. ఈ క్రమంలోనే తన ఇంట్లో చోరీ జరిగిందని గుర్తించిన యజమాని పోలీసులకు ఫిర్యాదు చేయడం, కేసు నమోదు చేసుకున్న పోలీసులు దొంగ కోసం ఆరా తీస్తుండగా.. బంగారాన్ని కొందరికి ఉచితంగా ఓ యువకుడు ఇస్తున్నాడనే సమాచారం తెలిసి అతన్ని పట్టుకున్నారు. విచారణ చేపట్టగా రెండో రోడ్డులో చోరీ చేసింది తానేనని ఒప్పుకున్నాడు. సొంతూరులో బంగారం ఎక్కడైనా దాచుంటాడని పోలీసులు గుజరాత్‌లోని సూరత్‌కు వెళ్లారు. అయితే, అక్కడ అతనికి తెలిసిన వారు లేరు. ఈ క్రమంలో వినయ్‌ను ఆరా తీస్తే తన గతాన్నంతా పూసగుచ్చినట్టు వివరించాడు. చలించిన పోలీసులు అతని కుటుంబ సభ్యుల కోసం ఆరా తీస్తే, తల్లి మరో వ్యక్తిని పెళ్లి చేసుకుందని, తండ్రి కొన్ని రోజుల క్రితమే మృతి చెందాడని తెలిసింది. ఈ విషయాన్ని ఇప్పటికీ పోలీసులు వినయ్‌కు చెప్పలేదు.

రాష్ట్ర స్థాయి క్రికెట్ జట్టుకు ఎంపిక

గుంతకల్లు: పట్టణానికి చెందిన బట్నాపాడు నందిని రాష్ట్ర స్థాయి అండర్-15 ఉమెన్స్ క్రికెట్ జట్టులో స్థానం దక్కించుకుంది. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి గోపీనాథ్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని నాయీ బ్రహ్మణ కాలనీకి చెందిన బట్నపాడు ధనుంజయ, లీలా దంపతుల కుమార్తె నందిని ఇటీవల నిర్వహించిన ఏటీపీ లీగ్ క్రికెట్ పోటీల్లో అత్యంత ప్రతిభ కనబరిచింది. దీంతో రాష్ట్ర స్థాయి జట్టుకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆమెను ఆర్‌డీటీ కోచ్ ఇనయతుల్లా, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.



నందిని

క్లుప్తంగా

యోగాసన పోటీల్లో అనంతకు రెండో స్థానం



ప్రతిభ చాటిన క్రీడాకారులు

అనంతపురం: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్‌లో భాగంగా రాష్ట్రస్థాయి అండర్–19 యోగా పోటీలు పశ్చిమ గోదావరి జిల్లా వీరవసరంలో ఇటీవల జరిగాయి. ఇందులో అనంతపురం జిల్లా క్రీడాకారులు రెండో స్థానం దక్కించుకున్నారు. అండర్–19 బాలికల విభాగంలో పూజిత (బీసీ వెల్ఫేర్ జూనియర్ కళాశాల, టీకులోడు) జాతీయ స్థాయికి అర్హత సాధించింది. ఈ సందర్భంగా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్–19 జిల్లా సెక్రటరీ లక్ష్మీనారాయణ అభినందించారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించండి



అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ భాగ్యలక్ష్మి

అనంతపురం కార్పొరేషన్: నగరపాలక సంస్థలో పనిచేసే పారిశుధ్య, ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కమిషనర్ భాగ్యలక్ష్మి సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం నగరపాలక సంస్థ కార్యాలయంలో అధికారులతో కమిషనర్ సమావేశం ఏర్పాటు చేశారు. కార్మికుల జీతభత్యాలు, పనిముట్లు, యూనిఫాం తదితర వాటిని ఏర్పాటు చేయాలన్నారు. అదనపు కమిషనర్ రమణారెడ్డి, ఈఈలు సుధారాణి, సూర్యనారాయణ పాల్గొన్నారు.

కురుగుంట లేఅవుట్ పరిశీలన : ఎన్నికల – స్పెషల్ సమ్మరీ రివిజన్‌లో భాగంగా మంగలవారి కాలనీలోని 115, 116, 117, 118, 119 పోలింగ్ కేంద్రాలను కమిషనర్ భాగ్యలక్ష్మి ఆకస్మికంగా తనిఖీ చేశారు. సూపర్‌వైజర్లు, బూత్ స్థాయి అధికారులతో సమావేశమయ్యారు. అనంతరం కురుగుంట లేఅవుట్‌ను పరిశీలించి, పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు.


గ్రామాల్లో చిరుత సంచారం



రైతులను విచారిస్తున్న ఫారెస్ట్ అధికారులు

రాప్తాడు: మండలంలోని లింగనపల్లి, బొమ్మేపర్తి గ్రామాల్లో చిరుత సంచరించినట్లు గ్రామస్తులు చెప్పుకుంటున్నారు. శుక్రవారం రాత్రి గొర్రెల మంద వద్దకు చిరుత వచ్చిందని, అక్కడే ఉన్న కుక్క మొరగడంతో.. చిరుత కుక్కను నోట కరుచుకొని పోయిందని గొర్రెల కాపరులు చెప్పున్నారు. చిరుతను చూసిన లింగనపల్లి, బొమ్మేపర్తి గ్రామాల రైతులు, గొర్రెల కాపరులు రాప్తాడు పోలీసులు, ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇచ్చారు. శనివారం పోలీసులు, ఫారెస్ట్ అధికారులు రెండు గ్రామాల్లో పర్యటించి, చిరుత సంచరించిన విషయాన్ని తెలుసుకున్నారు. ప్రజలు, రైతులు ఆందోళన చెందొద్దన్నారు. చిరుత సంచరించిన పరిసరాల్లో జింక కళేబరం లభ్యం కావడంతో దాన్ని అధికారులు, రైతులు ఖననం చేశారు.

రంగస్థల కళాకారిణి రాజ్యలక్ష్మి మృతి



అనంతపురం కల్చరల్: అనంత రంగస్థల కళాకారిణి గుంటుపల్లి రాజ్యలక్ష్మి (63) మృతి చెందారు. ఐదేళ్ల ప్రాయంలోనే నాటక రంగంలో ప్రవేశించి, ఎన్నో పౌరాణిక, సాంఘిక,జానపద పాత్రల్లో పేరు సంపాదించుకున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వేలాది నాటకాల్లో పలు పాత్రలు పోషించారు. హరిశ్చంద్ర నాటకంలో చంద్రమతి పాత్ర, బాల నాగమ్మ, శాంతిమతి, సత్యభామ తదితర పాత్రలు ఆమెకు పేరు తెచ్చిపెట్టాయి. ఈమె భర్త కీర్తిశేషులు గుంటుపల్లి నాగేశ్వర రావుతో కలిసి ఎన్నో పాత్రలు వేశారు. ఆమె ఆకస్మిక మరణం అనంత రంగస్థలానికి తీరని లోటని సీనియర్ నటులు, నాటక సమాజ ప్రతినిధులు రావూరి నాగేశ్వరరావు, మైకేల్‌బాబు, సరోజమ్మ, వనజమ్మ, లలిత, సుహాసిని తదితరులు తీవ్ర సంతాపాన్ని తెలియజేశారు. రాజ్యలక్ష్మికి ఒక కుమారుడు ఉన్నాడు. శనివారం రాజ్యలక్ష్మి అంత్యక్రియల్లో పాల్గొని అశ్రునివాళులర్పించారు.

అంగన్‌వాడీ ఆయాకు మెమో

అనంతపురం సెంట్రల్: నగరంలోని జీసస్‌నగర్ అంగన్‌వాడీ హెల్పర్‌కు ఐసీడీఎస్ అధికారులు మెమో ఇచ్చారు. శనివారం సాక్షిలో 'అంగన్‌వాడీ ఆయా చేతివాటం' శీర్షికన వార్త ప్రచురితమైంది. స్పందించిన అర్బన్ సీడీపీఓ లలితమ్మ విచారణ చేసి నివేదిక ఇవ్వాలని సూపర్‌వైజర్ కొండమ్మను ఆదేశించారు.చిన్నారి తల్లిదండ్రులు, ఆయాను విచారించా రు. విచారణ అనంతరం నివేదికను సీడీపీఓకు అందించారు.

ప్రసన్నాయపల్లిని కార్పొరేషన్‌లో విలీనం చేస్తాం

• ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



చిన్మయనగర్‌లో సంక్షేమ పథకాల బ్రోచర్ అందిస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

రాప్తాడు: జిల్లా కేంద్రానికి సమీపంలో ఉన్న ప్రసన్నాయపల్లి పంచాయతీని భవిష్యత్తులో అనంతపురం నగరపాలక సంస్థ కార్పొరేషన్‌లో విలీనం చేసేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తెలియజేశారు. మండలంలోని ప్రసన్నాయపల్లి పంచాయతీలోని చిన్మయనగర్‌లో జెడ్పీటీసీ సభ్యురాలు పసుపుల హేమావతితో కలిసి 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు.

గత టీడీపీ ప్రభుత్వం అభివృద్ధిని విస్మరించింది..

గత టీడీపీ ప్రభుత్వం ప్రసన్నాయపల్లి పంచాయతీ అభివృద్ధిని విస్మరించిందని ఎమ్మెల్యే అన్నారు. అనంతపురం నుంచి చిన్మయనగర్ మీదుగా జేఎన్‌టీయూ రోడ్డు నిర్మాణం పేరుతో గత ప్రభుత్వం వంద ఇళ్లను కూల్చివేసి, నిర్మాణం చేపట్టకుండా వదిలేసిందన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకొచ్చిన వెంటనే జేఎన్‌టీయూ నుంచి రైల్వే బ్రిడ్జి వరకు రోడ్డు నిర్మించినట్లు తెలిపారు. జేఎన్‌టీయూ రహదారిపై పండమేరు బ్రిడ్జి నిర్మాణానికి రూ.7 కోట్ల నిధులు మంజూరు చేయించామన్నారు. 44వ జాతీయ రహదారి బెంగళూరు హైవే నుంచి ప్రసన్నాయపల్లి వరకు కనెక్టివిటీ రహదారిని నిర్మించామన్నారు. రాప్తాడు పొలంలో రాప్తాడు, ప్రసన్నాయపల్లి పంచాయతీ ప్రజలకు 640 మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చి, ఇళ్లు కూడా నిర్మిస్తున్నామన్నారు. సొంత స్థలాలు ఉన్న 400 మందికి ఇళ్లు మంజూరు చేయించామన్నారు. అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందకపోతే తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు :

అవినీతికి తావులేకుండా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని ఎమ్మెల్యే అన్నారు. సంక్షేమ పథకాల ద్వారా ప్రతి ఇంటికీ రూ.లక్షలు లబ్ధి చేకూరిందన్నారు. జగనన్న ముఖ్యమంత్రి అయిన తర్వాత ప్రసన్నాయపల్లి పంచాయతీలో కనీస వసతుల కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకున్నామన్నారు. పంచాయతీలో రూ.1.20 కోట్లతో రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణాలు చేపట్టామన్నారు. పంచాయతీ మరింత అభివృద్ధి చేసేందుకు సొంత నిధులు, దాతల సహకారంతో రూ.కోటితో మరింత అభివృద్ధి చేస్తామన్నారు. పన్ను వసూళ్ల ద్వారా వచ్చే ఆదాయం ప్రతి పైసానూ పంచాయతీ అభివృద్ధికి ఖర్చు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. అవినీతి రహిత పాలన అందించడమే కాకుండా ప్రజలందరికీ తోడుగా నిలుస్తున్న సీఎం జగన్‌మోహన్ రెడ్డికి బాసటగా నిలవాలన్నారు. మరోసారి జగనన్నను ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సాల్మన్, హౌసింగ్ ఏఈ పవన్, ఏపీఎం శివకుమార్ రెడ్డి, గొర్రెలు, మేకల సంఘం జిల్లా అధ్యక్షుడు పసుపుల నరసింహగౌడ్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు చిట్రా వెంకటేష్, పసుపుల ఆది, వైస్ ఎంపీపీ రామాంజనేయులు, స్థానిక నాయకులు మాజీ ఎంపీటీసీ రాజశేఖర్, వెన్నపూస లోకేశ్వర్‌రెడ్డి, మధుసూదన్ రెడ్డి, విజయ్ వర్ధన్ రెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, మనోహర్, విష్ణు కంచి రెడ్డి, చిన్న రోసిరెడ్డి, ఉదయ్ కుమార్‌రెడ్డి, సాంబశివారెడ్డి, ఉషారాణి, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అధైర్య పడొద్దు..అండగా ఉంటాం :

రాప్తాడు: అధైర్య పడకండి...మీకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి భరోసా ఇచ్చారు. అయ్యవారిపల్లికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఫణిభూషణ్ రెడ్డి గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే.. శనివారం గ్రామానికి చేరుకొని ఫణిభూషణ్ రెడ్డి మృతదేహానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి, అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

హోటళ్లు, బేకరీల్లో తనిఖీలు

అనంతపురం క్రైం: జిల్లా కేంద్రంలోని పలు హోటళ్లు, బేకరీలపై శనివారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తపోవనం కూడలిలోని నాయుడు కుండ బిరియానీ సెంటర్, ఇందిరా ప్రియదర్శిని హోటల్, హోటల్ చౌరస్తా, ఆర్.కే రెస్టారెంట్, మారుతీ బెంగళూరు బేకరీ, రూపా గార్డెన్ రెస్టారెంట్, అనంత బిరియానీ సెంటర్‌లకు జరిమానాలు విధించారు. నిషేధిత ప్లాస్టిక్ వినియోగంతో పాటు అపరిశుభ్ర వాతావరణంలో హోటళ్లను నిర్వహిస్తుండటాన్ని తప్పుబట్టారు. మొత్తంగా రూ.85 వేలు జరిమానా విధించి తదుపరి చర్యలకు ఫుడ్ ఇన్స్‌పెక్టర్స్, మునిసిపల్ అధికారులకు ఈ కేసులను బదిలీ చేసినట్లు ఎస్పీ మునిరామయ్య తెలిపారు.

చరిత్రలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి



21వ డివిజన్‌లో రోడ్డు పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే అనంత, మేయర్ వసీం, తదితరులు

•ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం కార్పొరేషన్: గత టీడీపీ ప్రభుత్వం నగరాభివృద్ధిని విస్మరించింది.. దీంతో విసిగిపోయిన ప్రజలు 2019లో వైఎస్సార్‌సీపీ విశ్వసించి, అధికారం ఇచ్చారని, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో నగరంలో చరిత్రలో ఎన్నడూ లేని విధంగా రూ.800 కోట్లతో అభివృద్ధి పనులు చేస్తున్నామని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. శనివారం నగరంలోని 21వ డివిజన్‌లో సీఎండీఎఫ్ నిధులు రూ.24 లక్షలతో రోడ్డు పనులకు ఎమ్మెల్యే భూమి పూజ చేశారు.

నియోజకవర్గానికి అధిక ప్రాధాన్యత:

సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అనంతపురం నియోజకవర్గానికి అధిక ప్రాధాన్యత ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 12 నుంచి 14 నియోజకవర్గాలకు మాత్రమే ప్రత్యేక నిధులు మంజూరు చేశారని, అనంతపురానికి రూ.25 కోట్లు మంజూరు చేశారన్నారు. నగరపాలక సంస్థ నిధులు రూ.వంద కోట్లకు పైగా అభివృద్ధి పనులకు కేటాయించినట్లు తెలిపారు. ప్రజారోగ్యం కోసం పని చేసే కార్మికులు అధిక సంఖ్యలో అంబేడ్కర్ నగర్‌లో నివసిస్తున్నారని, గత టీడీపీ ప్రభుత్వం ఈ ప్రాంతాన్ని పూర్తిగా విస్మరించిందన్నారు. కాలువలు, రోడ్లు సరిగా లేక ప్రజలు ఇబ్బందులుపడేవారన్నారు. ప్రస్తుతం 21వ డివిజన్‌లో రూ.1.75 కోట్లతో అభివృద్ధి పనులు చేసినట్లు తెలిపారు. మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య మార్కెట్ యార్డు చైర్మన్ ఫయాజ్, పార్టీ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైపుల్లాబేగ్, కార్పొరేటర్లు సాకే చంద్రలేఖ, లావణ్య, లీలావతి, కోఆప్షన్ సభ్యుడు షంషుద్దీన్, నాయకులు చిన్నా, శోభన్ పాల్గొన్నారు.

అనంతపురం కార్పొరేషన్:నగరంలో పలు ప్రాంతాల్లో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను మేయర్ వసీం శనివారం పరిశీలించారు. ప్రజలకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ప్రజలకు ఓపిగ్గా సేవలు అందించాలని వైద్యులు, తదితర ఆరోగ్య సిబ్బందిని ఆదేశించారు. అనంతరం సాయినగర్‌లో జరిగిన వైద్య శిబిరంలో గర్భిణులకు సీమంతం కార్యక్రమం నిర్వహించారు. అనంతరం జూనియర్ కళాశాల ఆవరణలో పైప్‌లైన్ లీకేజీ పనులపై మేయర్ ఆరా తీశారు. లీకేజీ సమస్యకు పరిష్కారం చూపాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, పార్టీ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైపుల్లాబేగ్, కార్పొరేటర్ బాలాంజనేయులు, నాయకులు జావిద్ పాల్గొన్నారు.

చెంతకే వైద్యం

అనంతపురం మెడికల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'జగనన్న ఆరోగ్య సురక్ష' వైద్య శిబిరాలు జిల్లాలో దిగ్విజయంగా సాగుతున్నాయి. శనివారం నాలుగు చోట్ల వైద్య శిబిరాలు నిర్వహించారు. 2,150 మంది వైద్య సేవలు పొందారు. 284 మంది వైఎస్సార్ కంటి వెలుగు కింద పరీక్షలు చేయించుకున్నారు. వివిధ రకాల ఆరోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్న 22 మందికి మెరుగైన వైద్యం కోసం జిల్లా, ఏరియా, ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు స్పెషలిస్టు వైద్యులు రెఫర్ చేశారు.

తహసీల్దార్ కార్యాలయాల్లో ముగ్గురు విధుల్లో చేరిక

సాక్షి ఎఫెక్ట్..

రాప్తాడురూరల్: అనంతపురం అర్బన్, రూరల్ తహసీల్దార్ కార్యాలయాలకు కేటాయించిన సిబ్బందిలో డిప్యూటీ తహసీల్దార్‌తో పాటు ఇద్దరు జూనియర్ అసిస్టెంట్లు విధుల్లో చేరారు. తహసీల్దార్ కార్యాలయాలు రెండుగా ఏర్పాటైన తర్వాత ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సిబ్బందిని నియమిస్తూ గత నెల 25న కలెక్టర్ గౌతమి ఉత్తర్వులు జారీ చేశారు. అయితే కొందరు ఉద్యోగులు పైరవీలు చేసుకుంటూ విధుల్లోకి చేరకుండా అలసత్వం ప్రదర్శిస్తున్నారు. శనివారం 'సాక్షి'లో 'కలెక్టర్ ఉత్తర్వులు బేఖాతరు' శీర్షికన కథనం ప్రచురితమైంది. కలెక్టర్ గౌతమి ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. అనంతపురం రూరల్ తహసీల్దార్ కార్యాలయానికి డిప్యూటీ తహసీల్దార్‌గా నియమించిన శ్రీనివాసులు, జూనియర్ అసిస్టెంట్ వరప్రసన్న కుమార్, అర్బన్ తహసీల్దార్ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ ఎస్.మహబూబ్‌బాషా ఆగమేఘాలపై విధుల్లో చేరారు. కలెక్టరేట్‌లో డీటీగా పని చేస్తున్న మారుతీప్రసాద్‌రెడ్డి అనంతపురం అర్బన్ తహసీల్దార్ కార్యాలయానికి రావాల్సి ఉంది. జాయింట్ కలెక్టర్ అందుబాటులో లేకపోవడంతో రిలీవ్ కాలేదని తెలిసింది. అనంతపురం తహసీల్దార్ కార్యాలయంలో డీటీగా పని చేస్తున్న దేవన్‌రాజా రిలీవ్ అయ్యి, కలెక్టరేట్‌కు వెళ్లాల్సి ఉంది. అనంతపురం రూరల్ ఆర్ఐగా నియమించిన ప్రశాంత్‌బాబు కూడా విధుల్లో చేరలేదు. రెండు కార్యాలయాలు ఒకేచోట ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై ఉన్నతాధికారులు దృష్టి సారించి సమస్య పరిష్కరించేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

నూతన విద్యావిధానంతో నైపుణ్యాలు మెరుగు



ప్రొఫెసర్ విశాలిని అభినందిస్తున్న వీసీ రంగజనార్ధన

• జేఎన్‌టీయూఏ వీసీ రంగ జనార్ధన

అనంతపురం: నూతన జాతీయ విద్యా విధానంతో నైపుణ్యాలు మెరుగుపడతాయని జేఎన్‌టీయూ అనంతపురం వీసీ ప్రొఫెసర్ జింకా రంగజనార్ధన అన్నారు. జేఎన్‌టీయూ అనంతపురంలో ఆరు రోజులుగా హ్యూమానిటీస్ విభాగం ఆధ్వర్యంలో ' నూతన జాతీయ విద్యావిధానం – సాధికారిత' అనే అంశంపై అధ్యాపకులకు ఏఐసీటీఈ ట్రైనింగ్, లర్నింగ్ (అటల్) శిక్షణ కల్పించారు. శనివారం ముగింపు కార్యక్రమంలో వీసీ మాట్లాడుతూ ప్రస్తుతం అకడమిక్ అంశాలతో పాటు నైపుణ్యాలకు ఎంతో ముఖ్య పాత్ర ఉందన్నారు. పరిశ్రమలు – కళాశాల మధ్య పరస్పర అవగాహన అవసరమన్నారు. గౌరవ అతిథిగా హాజరైన రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సి. శశిధర్ మాట్లాడుతూ ఇలాంటి సదస్సులతో నూతన పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి వీలవుతుందన్నారు. కార్యక్రమానికి ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ అధ్యక్షత వహించారు. ప్రోగ్రాం కోఆర్డినేటర్‌గా ప్రొఫెసర్ వీబీ చిత్ర, కోకోఆర్డినేటర్ డాక్టర్ జి. మమత వ్యవహరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఈ.అరుణ కాంతి, పాలక మండలి సభ్యుడు డాక్టర్ ఎం. రామశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

ఐసీఎస్ డైరెక్టర్ బాధ్యతల స్వీకరణ..

జేఎన్‌టీయూ అనంతపురం నూతన ఇండస్ట్రియల్ కన్సెల్టెన్సీ సర్వీసెస్ (ఐసీఎస్) డైరెక్టర్ ప్రొఫెసర్ ఎన్. విశాలి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జేఎన్‌టీయూ అనంతపురం వీసీ జింకా రంగ జనార్ధన, రెక్టార్ ప్రొఫెసర్ ఎం. విజయకుమార్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సి.శశిధర్ అభినందించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు ప్రొఫెసర్ పి. సుజాత, ప్రొఫెసర్ ఆర్.కిరణ్మయి, ప్రొఫెసర్ బి.ఈశ్వర్ రెడ్డి, పాలక మండలి సభ్యుడు ప్రొఫెసర్ బి. దుర్గాప్రసాద్, ప్రొఫెసర్ ఆర్. ప్రశాంతి, డాక్టర్ ఓం ప్రకాష్, డిప్యూటీ రిజిస్ట్రార్ ఎన్.మధుసూధన్‌రెడ్డి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ సాకే నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి

అనంతపురం క్రైం: జిల్లాలోని సివిల్, ఏఆర్ సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ తెలిపారు. శనివారం జూమ్ ద్వారా స్పందన కార్యక్రమం నిర్వహించారు. పోలీసులు అధికారులతోపాటు, సిబ్బంది ఎస్పీకి సమస్యలు విన్నవించారు. జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లు, పోలీసు కార్యాలయాల నుంచే కాకుండా ఏఆర్ విభాగంలోని సిబ్బంది సమస్యలు ఎస్పీ విన్నారు. కొన్ని అక్కడికక్కడే పరిష్కరించారు. మిగతా వాటికి చట్ట పరిధిలో పరిష్కారం చూపుతామని సిబ్బందికి స్పష్టం చేశారు.

పెట్రోల్ బంకుల్లో తనిఖీ

అనంతపురం క్రైం: నగరంలోని పలు పెట్రోలు బంకులు, రేషన్ సరఫరా చేసే వాహనాల్లోని తూకాలను తూనికలు, కొలతల శాఖ అధికారులు తనిఖీలు చేశారు. ఇద్దరు రేషన్ పంపిణీ చేసే క్రమంలో తూకాల్లో మోసం చేస్తున్నట్లు గుర్తించి, కేసులు నమోదు చేశారు. పెట్రోలు బంకుల్లో వాహనదారులు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో సూచించారు. పెట్రోల్ పంపుల్లో ఎలాంటి మోసాలు జరుగుతాయో వాహనదారులకు వివరించారు. తనిఖీల్లో అసిస్టెంట్ కంట్రోలర్ పి.సుధాకర, మహ్మద్‌గౌస్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ముగిసిన నైపుణ్య శిక్షణ



శిక్షణ తీసుకున్న విద్యార్థినులతో అధ్యాపకులు, కళాశాల యాజమాన్యం

అనంతపురం ఎడ్యుకేషన్: నగరంలోని ఎస్వీ డిగ్రీ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అకాడమీ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆరు రోజుల పాటు నిర్వహించిన నైపుణ్య శిక్షణ శనివారం ముగిసింది. మొత్తం 87 మంది విద్యార్థినులు శిక్షణ తీసుకున్నారు. ఇలాంటి శిక్షణ తరగతులు విద్యార్థులకు చాలా ఉపయోగకరమని ఫ్యాకల్టీ బి.ఆంజనేయులు, ఎస్.మహబూబ్ షబని తెలిపారు. ముగింపు కార్యక్రమంలో కళాశాల వైస్ చైర్మన్ సి.చక్రధర్ రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ వై.మధుసూదన్‌రెడ్డి, ఏఓ శ్రీనాథ్, డీడీఎం రాజగోపాల్ పాల్గొన్నారు.

మీడియా కిట్ల వితరణ

అనంతపురం మెడికల్: సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి మైక్రో బయాలజీ విభాగానికి రూ.30 వేలు విలువ చేసే కల్చర్ మీడియా కిట్లు, నిర్ధారణ పరీక్షల్లో వినియోగించే యాంటీ బయోటిక్లను కదిరి లైఫ్‌లైన్ ల్యాబొరేటరీ నిర్వాహకులు ఆరిఫ్ శనివారం అందించారు. ఆరిఫ్‌ను డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్రమణ్యం, ఎస్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఆదిరెడ్డి పరదేశీనాయుడు సన్మానించారు.

జాప్ ఆధ్వర్యంలో సీఎంకు కృతజ్ఞతలు

అనంతపురం ఎడ్యుకేషన్: జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల మంజూరుపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సానుకూల నిర్ణయం తీసుకోవడంపై జర్నలిస్ట్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (జాప్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొత్తపల్లి అనిల్‌కుమార్ రెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. పాదయాత్రలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాత్రికేయులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారన్నారు. రాష్ట్రంలో కొందరు మీడియా యాజమాన్యాలు ప్రభుత్వంపై నిత్యం వ్యతిరేక వైఖరి అవలంబిస్తున్నా..ఆయన పట్టించుకోకుండా పాత్రికేయుల స్థితిగతులను దృష్టిలో పెట్టుకొని ఈ నిర్ణయం తీసుకున్నారన్నారు. గతంలో దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పాత్రికేయులకు విలువైన ఇళ్ల స్థలాలు ఇచ్చారన్నారు.

నేడు ముగింపు వారోత్సవాలు

అనంతపురం కల్చరల్: విజిలెన్సు వారోత్సవాల సందర్భంగా నెహ్రూ యువకేంద్రం ఆదివారం వివిధ రకాల పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎన్వైకే డీడీవో శ్రీనివాసులు అన్నారు. ఈ మేరకు శనివారం నెహ్రూ యువకేంద్ర కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విజిలెన్సు వారోత్సవాల ముగింపురోజున నెహ్రూ యువకేంద్రం, ఎస్సార్ ఎడ్యుకేషనల్ సొసైటీ, ప్రగతి పథం సంస్థలతో కలిసి క్విజ్, వక్తృత్వపు పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. అంతకు ముందు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు రాష్ట్రపతి అవార్డు గ్రహీత భరత్, సుంకర రమేష్, కాపు నాడు పేరూరు శ్రీనివాసులు, వెంకటేశులు విజిలెన్సు ఎస్పీని కలిసి వేడుకలకు ఆహ్వానించారు.

మాతృమూర్తికి నిలువెత్తు స్వరూపమే గోమాత





ప్రవచనాలు చెప్తున్న డాక్టర్ చాగంటి కోటేశ్వరరావు , ప్రవచనాలకు హాజరైన ఆధ్యాత్మికవేత్తలు, ప్రజలు

•బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

అనంతపురం: గోమాత, భూమాత ప్రేమ, శాంతి స్వరూపాలు అని, మాతృమూర్తికి నిలువెత్తు స్వరూపమే గోమాత అని బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు అన్నారు. జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాల క్రీడా మైదానంలో రెండు రోజుల పాటు 'ధర్మ వర్ధని' ట్రస్టు ఆధ్వర్యంలో ' మాతృ చతుష్టయం' అనే అంశంపై ప్రవచామృత కార్యక్రమం నిర్వహించారు. తొలి రోజు శనివారం బ్రహ్మశ్రీ డాక్టర్ చాగంటి కోటేశ్వరరావు గోమాత, భూమాత గురించి ప్రవచామృతాన్ని అందించారు. ఈ లోకంలో పరదేవతే గోవుగా తిరుగుతూ ఉంటుందన్నారు. అందరూ కామాక్షి ఆలయంలోకి వెళ్లి అమ్మవారికి అరటి పండు తినిపించలేరని, ఒక ఆవుకు అరటిపండు తినిపిస్తే పరదేవతకు అరటి పండు నైవేద్యంగా పెట్టినంత ఫలితం వస్తుందన్నారు. ఆశ్రమ అధికారంతో సంబంధం లేకుండా అందరూ పూజ చేయగలిగిన పరదేవత స్వరూపం గోవు మాత్రమేనన్నారు. గోమాతను పూజిస్తే సకల శుభాలు కలుగుతాయన్నారు. ప్రవచనం అనంతరం గోమాత శరీరంలో అందరు దేవతలు ఏ విధంగా నివసిస్తు ఉంటారని వేదం చెప్పిందో, గోమాత సకల దేవతా స్వరూపం అనే ఒక అరుదైన వీడియోతో చూపించగా, భక్తులు పరవశించిపోయారు. భూమాతను మనం అనేక విధాలుగా బాధ పెట్టి భోగాలు అనుభవిస్తున్నా, ఆవిడ ఓర్పుతో మనల్ని అనుగ్రహించి, తనలో కలుపుకుంటూ ఉంటుందన్నారు. కాబట్టే భూమాత అందరికీ తల్లి అన్నారు. మనం భూమాతలో కలిసిపోయేటప్పుడు ఆవిడ గర్వపడాలని, ఏ తల్లికైనా , ప్రధానంగా భూమాతకు సంతోషకరమన్నారు. గోమాతను వేదికపై పూజించి, మంగళహారతి ఇచ్చి, తొలి రోజు కార్యక్రమాన్ని ముగించారు. ఆదివారం జగన్మాత, మాతృమూర్తిపై బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు ప్రవచనామృతం అందించనున్నారు.

ఉట్టిపడిన ఆధ్యాత్మిక భావం: జేఎన్‌టీయూ అనంతపురం క్యాంపస్ జనసంద్రంగా మారింది. ఆధ్యాత్మిక వేత్తలు, భక్తులు పోటెత్తారు. డాక్టర్ చాగంటి కోటేశ్వరరావు ప్రవచనాన్ని ఆద్యంతమూ ఆసక్తిగా ఆలకించారు. జేఎన్‌టీయూ అనంతపురం వీసీ ప్రొఫెసర్ జింకా రంగజనార్ధన, రిజిస్ట్రార్ సి.శశిధర్, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ, ధర్మవర్ధిని ట్రస్టు ఇన్‌చార్జ్ సుధీర్ పాల్గొన్నారు.

చాగంటి కోటేశ్వరరావుకు సత్కారం

జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాలలో ప్రవచనామృతాన్ని అందించడానికి విచ్చేసిన డాక్టర్ చాగంటి కోటేశ్వరరావును అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే అనంత వెంకట్రామి రెడ్డి సత్కరించారు. ఎమ్మెల్యేతో పాటు మేయర్ వసీం సలీం, డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కర్ రెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ ఫయాజ్, మైనార్టీ విభాగం అధ్యక్షుడు సైపుల్లా బేగ్ కలిశారు.